# గగన్‌యాన్ ప్రయోగానికి ముందు కీలక పరీక్ష విజయవంతం




### - షార్‌తో పాటు ఇస్రో శాస్త్రవేత్తల్లోను ఉత్సాహం

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గగన్‌యాన్ ప్రయోగానికి ముందు కీలకపరిశోధనలు జరుగుతూనేఉన్నాయి. సిఇ-20 క్రయో జనిక్ ఇంజన్ స్థిర పరీక్షను ఇటీవల విజయవంతంగా జరిపినట్లు బుధవారం ఇస్రో ప్రకటించింది. మానవసహిత ప్రయోగానికి ముందు ఇది కీలక పరీక్షగా ఇస్రో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. త్వరలో జరిగే మానవరహిత ప్రయోగంలో ఈ సిఇ-20 ఇంజన్‌ను ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో ఈ పరీక్ష గతవారం చేపట్టినట్లు ఇస్రో పేర్కొంది. ఎల్‌వి ఎం-3 భారీ రాకెట్ ద్వారా మానవ సహిత ప్రయోగాన్ని ఇస్రో చేపట్టాల్సి ఉంది. ఇప్పటికే ఎన్నో పరీక్షలు, కీలక పరిశోధనలు ఇందుకోసం వివిధ ప్రాంతాల్లో జరిగాయి.ప్రస్తుతంగగన్‌యాన్(జి1)నప్రయోగానికిఇస్రో సిద్ధమవుతోంది. ముందు గా ఇటువంటి ప్రయోగాలు షార్‌లో చేపట్టి ఆ తర్వాత వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ యాత్ర చేపట్టనున్నారు. సిఇ-20 ఇంజన్ సామర్థ్యం 19 నుంచి 22 టన్నుల బరువు ఉండగా దాన్ని 442 సెకన్ల కాలం మండించి సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# గంజాయి మయంగా రాష్ట్రం!

### - మహిళలపై అత్యాచారాల్లో ఏపి దేశంలోనే నెంబర్‌వన్.. - వైకాపా పాలనలో మహిళలకు రక్షణ కరువు !!- నారా భువనేశ్వరి ఆరోపణ



సదస్సులో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి



సదస్సుకు హాజరైన మహిళలు



శాంతిపురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : సిఎం జగన్ పాలనలో రాష్ట్రాన్ని గంజాయి క్యాపిటల్ ఆఫ్ ఇండియా మార్చారని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సతీమణి,ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు.బుధవారం శాంతిపురంలో నిజం గెలవాలి కార్యక్రమం లో భాగంగా జరిగిన కుప్పం మహిళలతో ఆడబిడ్డలకు ఆర్థికస్వేచ్ఛ అంశంపై ముఖాముఖి లో ఆమె పాల్గొని ప్రసంగించారు. మహిళలపై అత్యాచారాల్లో ఎపిని నెంబర్‌వన్‌స్థానంలోజగన్‌నిలబెట్టాడనివ్యాఖ్యలుచేశారు. ఓమహిళకు గంజాయి అలవాటు చేసి నలుగురు అత్యాచారానికి పాల్పడ్డారని ఈ విషయాలపై సిఎం జగన్ సిగ్గుపడాలన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఏ హామీలు ఇచ్చారో అవి తప్పక అమలు చేస్తారన్నారు. చేతనయితేనే ఆయన చెబుతారన్నారు. ఈ విషయాన్ని మహిళలు గుర్తుంచుకుని ఆదరించాలని కోరారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధమాట్లాడుతూ 2004లో అలిపిరి ఘటన జరిగిన సమ యంలో చంద్రబాబు గురించి భువనమ్మ పడిన ఆవేదన వర్ణించలేనిదన్నారు. నిజం గెలవాలి కార్యక్రమం ద్వారా చంద్రబాబు అరెస్ట్ తట్టుకోలేక మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు 3200కి.మీ.ల ప్రయాణం ఇప్పటి వరకు చేశారన్నారు. అనంతరం సరస్వతి, స్వాతి, వరలక్ష్మి, సౌజన్య, మమత అనే మహిళలు, యువతలు నారా భువనేశ్వరితో ఇష్టాగోష్టిలో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం స్థానిక లక్ష్మి థియే టర్ వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్‌మునిరత్నం, పార్టీ పరిశీలకుడు గాజులఖాదర్‌బాషా, చంద్రబాబు కార్యదర్శిమనోహర్,రాష్ట్ర నేత డా॥ సురేష్‌బాబు, నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్,ఎల్.జయరాంరెడ్డి, మణి, ఉయ్యాల జయరాంరెడ్డి, రమేష్, చంద్ర,గోపాల్, రాజు, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, రూప పాల్గొన్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న చేస్తున్న దృశ్యం.

పెద్దపంజాణి ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు అరెస్టు సందర్భంగా మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు ఎన్టీఆర్ ట్రస్టీ నారా భువనేశ్వరీ అండగా నిలిచారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా ఆమె మండలంలోని కత్తార్లపల్లె గ్రామానికి చెందిన శంకరప్ప,శివాడి గ్రామానికి చెందిన కనకరాజు నివాసగృహాలకు వెళ్ళారు. ఈ సందర్భంగా వారిచిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి ఘననివాళుల ర్పించారు.ఈ సందర్భంగా శంకరప్ప,కనకరాజు కుటుంబాలకు చెరో 3లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.



కార్యక్రమంలో టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు పులివర్తి నాని, మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డిలతో పాటు మండల నాయకులు ఆనంద్,చలపతి,( కిష్టారెడ్డి, మాజీ ఎంపిపి మురళి, భానుప్రతాప్‌రెడ్డి, నాగిరెడ్డి, తధితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి గోడపత్రికల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి ప్రారంభం కానున్నాయి.ఈ మేరకు బుధవారం ఆలయంలోని గురుదక్షిణా మూర్తి ఆలయం ఎదురుగా శాస్త్రోక్తంగా ఆవిష్కరించారు. కార్యక్రమాలను ఆలయ ఇఓ వి.యస్ నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేయగా ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మొదట ఆలయంలో గురుదక్షిణామూర్తి ఆలయానికి పూజలు జరిపారు.ప్రతి ఒక్కరి ఇంటి పండగగా నిర్వహించాలి:ఈ సందర్భంగా ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ మహాశివరాత్రి పండగను ప్రతి ఒక్కరి పండగగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. 13రోజుల పాటు సందడి చోటు చేసుకునే విధంగా చేసుకోవాలన్నారు.ఇక శివయ్యపండగను దేశ విదేశాల్లో ప్రాశస్త్యం పొందేటట్లు నిర్వహించటంలో అధికారులు, సిబ్బంది పాత్ర కీలకమైనదన్నారు. ఇప్పటికే యుద్ధ ప్రాతిపదికపై పనులు చక చకా జరుగుతున్నాయన్నారు.గత ఏడాది కన్నా భిన్నంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమాల్లో ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సభ్యులు మున్నారాయల్, బుల్లెట్‌శ్యాం, కొండూరు సునీత, రమాప్రభ, లక్ష్మి, పసల సుమతి ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు దేవస్థానం ఎసి మల్లికార్జున ప్రసాద్, ఎఇఓలు ధనపాల్, సతీష్‌మాలిక్,లోకేష్‌రెడ్డి, టెండపుల్ సూపరిం టెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు, సుదర్శనం రెడ్డి, కొండూరు నంద, భాస్కర్ ముదిరాజ్, పసల రమణయ్య, వేలూరు రమేష్, సూరా సురేష్, ధన, కళ్యాణ్, బాలాగౌడ్, సుధీర్,సాయి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు అభివృద్ధికి సమిష్టి కృషి

### - వేసవిలో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా చర్యలు - మున్సిపల్ సమావేశంలో మేయర్ అముద




మున్సిపల్‌సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: చిత్తూరు నగర అభివృద్ధికి కార్పొరేటర్లు, అధికారులు కలిసికట్టుగా కృషి చేయా లని మేయర్ అముద పిలుపునిచ్చారు.మున్సిపల్ సమావేశ భవనంలో బుధవారం మేయర్ అముద అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేయర్ మాట్లాడుతూ వేసవి ప్రారంభం కావడంతో నగర పరిధిలో ఎక్కడ మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగర పరిధిలో వీధి దీపాలు, మురికి కాలువల పరిశుభ్రత, దోమల నియంత్రణ వంటి చర్యలు పకడ్బందీగా కార్యాచరణ రూపొందించి ప్రజారోగ్యసంరక్షణకు నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో గిరింపేట మున్సిపల్ పార్కు స్థలంలో స్వతంత్ర్య సమరయోధులు మరుదూరు బ్రదర్స్ అయిన పెరియమరుదు, చిన్నమరుదు విగ్రహాలను ప్రతిష్ఠించిపార్కును మరుదూరు బ్రదర్స్ అయిన పెరి, చిన్నమరుదు పేరు పెట్టాలని సమావేశం తీర్మానించింది. అలాగే పివికెఎన్ డిగ్రీ కళాశాల నుండి అంబేద్కర్ భవన్ వరకు వున్న రోడ్డుకు కెబిఆర్ మ్యాంగో భవన్ రోడ్డు, కట్టమంచి నుండి సాంబయ్య కండ్రిగ వున్న రోడ్డును డాక్టర్ సిఆర్ రెడ్డి బైపాస్ రోడ్డుగా నామకరణం చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. అలాగే నగర పరిధిలోని చెరువు వీధిని పొన్నుస్వామి నాయకర్ వీధిగా పేరు మార్చడంను కౌన్సిల్ ఆమోదించింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూరగాయల మార్కెట్లు, జంతు వధశాల,ఎన్టీఆర్ బస్టాండ్, కాసు బ్రహ్మానందంరెడ్డి బస్టాండ్లకు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు గేటు వసూలు ఖరారుకు బహిరంగ వేలం వేయడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే అక్రిడెటెడ్ జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సంబంధించి ఇరువారం గ్రామరెవెన్యూలో గుర్తించిన భూమి భూస్వ భావం తహసిల్దారు వారితో మార్పు చేయడానికి కౌన్సిల్ ఆమోదించింది. ఈ సమావేశంలో డిప్యుటీమేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎంఇ గోమతి, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సిఎంఎం గోపి, ఎసిపి రామకృష్ణుడు, కార్పొరేటర్లు, కో-అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

**రూ.274.93 కోట్లతో బడ్జెట్ అంచనా ఆమోదం**

చిత్తూరు నగర పాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 274.93 కోట్ల రూపాయలతో బడ్జెట్‌ను ఆమోదించింది. మేయర్ అముద అధ్యక్షతన బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేయర్ అముద 2024-25 ఆర్థిక సంవత్సరానికి 274.93 కోట్ల రూపాయలతో మున్సిపల్ కార్పొరేషన్ రూపొందించిన బడ్జెట్ అంచనాను సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు కౌన్సిల్‌సభ్యులు మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. 2024-25 ఆర్థికసంవత్సరంలో మున్సిపల్ కార్పొరేషన్‌కు సాధారణ, మూలధన్ జమల ద్వారా 274,93,45,236 రూపాయల ఆదాయం లభిస్తుందని బడ్జెట్‌లో అంచనా వేయగా 265,36,67,946రూపాయల మూలధనం వ్యయంగా బడ్జెట్‌లో చూపించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యుటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎంఇ గోమతి, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అత్యాచారం నిందితుడిపై కఠిన చర్యలు

### - రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి - బాలికకు పరామర్శ.. సంఘటనపై సమగ్ర విచారణకు ఆదేశం !!



మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి

కుప్పంరూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : రామకుప్పం మండలంలో ఓ మైనర్ బాలికపై సెల్వరాజ్ అనే యువకుడు అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు గజ్జల లక్ష్మి ఆదేశించారు. బుధవారం ఆమె కుప్పం ఏరియా ఆస్పత్రికి చేరుకుని బాధిత బాలికను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం జిల్లా ఎస్పీతో మాట్లాడారు. ఈ సంఘట నను కమీషన్ సుమోటోగా స్వీకరిస్తుందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులతో ఆమె మాట్లాడారు. బాలిక వివరాలపై గోప్యత పాటించాలని తగు వైద్యం, రక్షణ కల్పించాలన్నారు. అనంతరం గజ్జెల లక్ష్మి మీడియాతో మాట్లాడారు. గతంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో వరుసగా టిడిపి నేతల వేధింపులకు కారణం చంద్రబాబు వెనకేసుకురావడమేనన్నారు. విజయవాడలో వినోద్ జైన్ కేసు సమయంలోనే చంద్రబాబు టిడిపి నేతలకు బుద్ధి చెప్పాల్సిందన్నారు. అప్పట్లో ఆయన ఉన్మాదులను వెనకేసుకురావడంతోనే రామకుప్పం ఘటనకు ప్రోత్సాహమైందన్నారు. ఇలాంటి ఘటనలను మహిళా కమీషన్ సహించే ప్రసక్తే లేదన్నారు. కీచక టిడిపి నేతలకు తగిన గుణపాఠం తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్ విజయకుమారి, సిడిపిఓ కల్పన, ఎస్సై శివకుమార్ పాల్గొన్నారు.

# నిజమే గెలుస్తుంది..భ్రమలన్నీ తొలగిపోతాయి : భువనేశ్వరి



పుంగనూరులో నిజం గెలవాలి కార్యక్రమంలో నారా భువనేశ్వరి

పుంగనూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : ఈదఫా ఎన్నికలలో రాష్ట్రమంతా నిజమే గెలవాలని,అపుడే రాష్ట్రానికి కమ్మిన భ్రమలు తొలగిపోతాయని మాజీ సిఎం చంద్రబాబునాయుడు సతీమణి,నారా భువనేశ్వరి అన్నారు. బుధవారం ఆమె నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబునాయుడు అరెస్టు విషయాన్ని తట్టుకోలేక పుంగనూరులో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించారు. ఈసందర్భంగా చెలిమిగడ్డలో బాధిత కుటుంబా నికి రూ.మూడు లక్షలు అందించారు. అనంతరం నానాసాహెబ్‌పేట,ఒంటిమిట్ట ప్రాంతాలలో పర్యటించి ఆయా గ్రామాలలో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఉదయం కార్యక్రమమైనప్పటికీ, సాయంత్రంగా పుంగనూరుకు చేరుకున్న ఆమె బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి తోడుగా ఉంటామని, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు.పుంగనూరులో దౌర్జన్యాలు మితిమీరి పోయిన విషయాన్ని స్థానిక నాయకులు ఆమెదృష్టికి తీసుకువెళ్ళారు. వీటన్నింటిని విన్న ఆమెమాట్లాడుతూ ప్రజలు ఇదంతా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల లో వైకాపా పార్టీకు బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమాలలో ఆమె వెంట మాజీ మంత్రి అమరనాధరెడ్డి, ఎన్.శ్రీనాధరెడ్డి, తెదేపా అభ్యర్థి చల్లాబాబుతో పాటూ చిత్తూరు ఎంపి టిక్కెట్టు ఆశిస్తున్న చౌడేపల్లి వాసి,డాక్టర్ గుండ్లూరు సురేంద్రబాబు,వైకాపా నాయకుడు సయ్యద్‌సుహేల్‌బాషా,పార్టీ కేడర్లు పాల్గొన్నారు.

## దేశం అధినాయకుని ఉదాసీనత...

# ఆశావహుల్లో ఉత్కంఠత

### ఎవరికి వారు...తమకే టిక్కెట్లు అని ప్రచారం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టిక్కెట్టు ఎవరికన్నది అధిష్టానం ఇప్పటి వరకు ప్రకటించలేదు.అయితే గత ఎన్నికల్లో పరాజయం పొందిన బొజ్జల సుధీర్‌రెడ్డి పార్టీ తరఫున ప్రచారాల్లో తలమునకలై ఉన్నారు. అంతేకాక ఓ వైపు ఆయన సతీమణి గ్రామాల్లో ఇంటింటికి వెళ్ళి ఒక్క అవకాశం కల్పించాలని అభ్యరిస్తూ పార్టీ ప్రకటించిన మిని మెనిఫేస్టోను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇక తెలుగుదేశం, జనసేన, బిజెపి పొత్తు ఉంటుందని తమకే అవకాశం అని తమ పార్టీ పెద్దలు అభయం ఇచ్చారంటూ ఓ వైపు బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్ ఆయన అనుయాయుల ద్వారా విస్తృతంగా ప్రచారంలో దూసుకు పోతున్నారు. ఇక గత ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసిన వినూత కోట తమ పార్టీ నాయకుడు తమకు అభయమిచ్చారని చెబుతూ ప్రచారాల్లో తలమునకలై ఉన్నారు. అన్ని పార్టీల వారు వాహనాలను ఏర్పాటు చేసుకొని డిజె సౌండ్ సిస్టంతో హోరెత్తిస్తున్నారు. ఎన్నికల ప్రకటన రాకముందే నియోజకవర్గంలో రాజకీయ సందడి చోటు చేసుకుంది. అయితే అధిష్టానం అయితే ఇప్పటి వరకు తాము ఎవ్వరికి టిక్కెట్లు ఖరారు చేయలేదు. పొత్తుల చర్చల తరువాతనే ఏ నియోజకవర్గం నుంచిఎవరు పోటీ చేయాలన్నది నిర్ధారించబడుతుందని చెబుతుండగా నియోజకవర్గంలో మాత్రం ప్రజల దృష్టిని ఆకట్టుకొనుటకు ప్రచారాలు సాగుతున్నాయి.

అధికార పార్టీ స్పీడ్...

శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని ఐదేళ్ళ పాటు పరిపాలించిన శాసనసభ్యుడు ఓ వైపు అభివృద్ధి మరో వైపు పార్టీ క్యాడర్‌ను పెంచుకొనుటకు ప్రతిపక్షం లేని నియోజకవర్గంగా తీర్చి దిద్దుకొనుటకు గతంలో పార్టీకి పని చేసిన వారికి నామినేటెడ్ పదవులనుఅ ఒదించటంలో తలమునకలై ఉన్నారు.అంతేకాక గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసుకున్న ఆయన ప్రతిపక్షం వలలో పడకుండా ముందుజాగ్రత్తగా కాపాడుకకుంటున్నారు. అంతేకాక పార్టీని సమర్థవంతంగా నడిపించటంలో ఆది నుంచి తండ్రికి అండగా ఉన్న ఆయన తనయ బియ్యపు పవిత్రారెడ్డి విశ్రాంతి లేకుండా మండలాల్లోని గ్రామాల్లో పర్యటి స్తున్నారు. ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు ఆమె దృష్టికి తెస్తున్న సమస్యలను పరిష్కరింటంలో అధికారులను పరుగులు తీయిస్తున్నారు. మరో వైపు ఆయన సతీమణి బియ్యపు వాణి కూడా ఈ ఏడాది రంగంలో దిగారు. ప్రచారంలో ఆమె కూడా పరుగులు తీస్తున్నారు.ఇలా అధికార పార్టీ నాయకులు తమ ఉనికిని కాపాడు కొనుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.

దేశంలో పెరుగుతున్న ఆశావహులు:

శ్రీకాళహస్తి తెలుగుదేశం పార్టీ టిక్కెట్టును ఆశిస్తున్న వారు రోజు రజుకు పెరిగిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆది నుంచికష్టకాలంలో పార్టీలోనే ఉంటూ పార్టీ పిలుపు మేరకు పోలీసులకేసుల్లో ఇరుక్కొని పార్టీని నడుపుతున్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి.అయితే ప్రస్తుతం పార్టీ ఐవిఆర్‌ఎస్ సర్వేల మేరకు, తాము నియమించుకున్న వ్యక్తిగత టీం సర్వేల మేరకే టిక్కెట్లు ఇస్తామని చెబుతుండటంతో ఆశావహుల సంఖ్య పెరుగుతుంది.ఈ నేపథ్యంలో మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు గతంలో 2019 ఎన్నికల్లో కూడా పార్టీ టిక్కెట్టు ఆశించారు. ఈ సారి కూడా ఆయన అవకాశం ఉంటే పోటీకి సిద్ధ పడుతున్నారు.ఇక కొత్తగా శ్రీకాళహస్తి రాజకీయాల్లో రెండవ స్థాయిలో బొజ్జల కుటుంబానికి వెన్నంటి ఉన్న పోతుగుంట గురవయ్యానాయుడు కుమారుడు డాక్టర్ రాజేష్ తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఆయన చిత్తూరు నాయకుల మద్దతుతో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇక పేరం నాగరాజా నాయుడు కూడా తెలుగుదేశం పార్టీ టిక్కెట్టు కోసం ప్రయత్నించినట్లు సమాచారం.పార్టీ టిక్కెట్టు ఇవ్వకుంటే తాము ఇండిపెండెంట్‌గా పోటీ చేయుటకు ప్రచారం చేసుకుంటున్నారు.

## మాధవరంలో టీడీపీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం



**తవణంపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజారిటీలో గెలిపించాలని కోరుతూ పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కలికిరి మురళీ మోహన్ బుధవారం మాధవరం పంచాయతీలో టీడీపీ,జనసేన నాయకులు,కార్యకర్తలతోకలసిఇంటింటిప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు దిలీప్ నాయుడు, ప్రధాన కార్యదర్శి మధుకుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీలుకోదండయ్య, వెంకటేశ్వర చౌదరి, క్లస్టర్ ఇన్చార్జి సునీల్ చౌదరి, నాయకులు వినాయకం, అరగొండ గిరిబాబు, చిట్టెమ్మ, షబ్బీర్ బాషా,గాంధీ,శరవణకుమార్,మోహన్‌బాబు, గణపతి జయపాల్, అరగొండ గోపీ, భాస్కర్‌రెడ్డి, రెడ్డెప్ప, రవినాయుడులతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



**తవణంపల్లె, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కార్యానికి అధికారులు చర్యలు తీసుకోవాలనిఎంపీపీగీతఅన్నారు.బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గీత అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైనపేదలకు అందేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జడ్ ్పటీసీ భారతి, వైస్ ఎంపీపీలు శోభ, పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, డిప్యూటీతహశీల్దార్ వెంకట రమణ, ఎంఈ ఓ హేమలత, ఏఓ ప్రవీణ్, ఏపీఎం రవిలతో పాటు ఎంపీటీసీలు,సర్పంచ్‌లు, ప ంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గురజాల సిమెంట్ బెంచీలు ధ్వంసం



**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, సత్యనారాయణపురం వద్ద జిజెఎం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో తెలుగుదేశం మాజీ కార్పొరేటర్ శేషాద్రినాయుడు ఏర్పాటుచేసిన సిమెంట్ బెంచీలను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినఘటనచోటుచేసుకొంది. పైటిడిపిమాజీకా ర్పొరేటర్‌శేషాద్రినాయుడు,జిజెఎం ట్రస్ట్‌ప్రతినిధులు ఈశ్వర్,సాయి, ఆర్ఎస్‌నాయుడు ,జగన్, సుధాకర్ నాయుడులు చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## మంత్రి,ఎంపిలతో చరిత్రాత్మక అభివృద్ధి

**-ఎంపిపి అక్కిసాని భాస్కరరెడ్డి**



**పుంగనూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పుంగనూరు మండలంలో మంత్రి పెద్దిరెడ్డి,ఎంపి మిధున్‌రెడ్డిల సహకారంతో చరిత్రాత మ్మకమైనఅభివృద్ధిని సాధించా మని, ఈఘనతవారికే దక్కుతుందని ఎంపిపి అక్కిసానిభాస్కరరెడ్డి అన్నారు. బుధవారం ఉదయం మండలపరిషత్తు సాధారణ సమావేశంజరిగింది .ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ పుంగనూ రు మండలం లో ఇపుడు తారు,సిమెంటురోడు ్ల,ప్రతి ప్రాంతానికి ఏర్పాటయ్యాయని, పంచా యతీ కేంద్రాలలోఆర్‌బికేలు, సచివాలచయాల ద్వారా పారదర్శకమైన సేవలందిస్తు న్నామన్నారు.వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ అమరనాథరెడ్డి,పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్, బోయకొండఛైర్మన్ నాగరాజరెడ్డి,ఎంపిడిఓతో పాటూ పలువురు అధికారులు,సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికీ సేవలందించమే ధ్యేయం

**-ఛైర్మన్ అలీంబాషా**



**పుంగనూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మంత్రి పెద్దిరెడ్డి,ఎంపి మిధున్‌రెడ్డిల ఆదేశాల తో మున్సిపల్ పట్టణం పరిధిలో ప్రతి కుటుంబానికీ సేవలం దించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మున్సిపల్‌ఛైర్ మన్ అలీం బాషాఅన్నారు. బుధ వారంఆయన ఏడవ వార్డు పరిధిలోని ప్రాంతాల ను పర్యటించారు. గడప గడపకూ వైకాపాలో భాగంగా ఇప్పటికే పట్టణం లో పలు ప్రాంతాలలో పర్యటించిఅందిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించామని తెలిపారు.

## ఆధార్ నమోదుకు సంచార కేంద్రాల ఏర్పాటు

**పాలసముద్రం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** నూతనంగా ఆధార్‌కార్డులు పొందడానికి,ఆధార్ కార్డుల్లో తప్పులను సరి చేసుకో డానికి ప్రజల సౌలభ్యం కోసం మొబైల్ ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేశామని ఎంపిడిఓ రామనాథరెడ్డి తెలిపారు. ఈ మొబైల్ ఆధార్ సెంటర్ వాహనం ఈ నెల 23వ తేదీ వరకు ఒకొక్క రోజు ఒకొక్క సచివాలయం పరిధిలోకి వెళ్ళి ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో వుంటుందన్నారు.

## టిడిపి నేతలకు వైకాపా తీర్థం



**యాదమరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండలంలోని పిసి కండ్రిగ, బొమ్మనుచేను గ్రామాలకు చెందిన పలువురు తెలుగుదేశం నాయకులు,పూతలపట్టు నియోజకవర్గ వైకాపాఇన్ ఛార్జి డాక్టర్ సునీ ల్ జడ్పీ వైస్‌ఛైర్మన్ భూమిరెడ్డిధనంజయరెడ్డి సమక్షంలో బుధవారం వైకాపాలో చేరారు. జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డిమాట్లడుతూఐదేళ్లలోసిఎం జగన్మోహన్‌రెడ్డి పథకాలకు లబ్ధిపొందిన అన్ని వర్గాల ప్రజలు పార్టీవైపు వస్తున్నారన్నారు. ఎంపిపిసురేష్‌బాబు, జిల్లా వైకాపా కార్య దర్శి మాదిరెడ్డిపల్లిమనోహర్‌రెడ్డి, వైస్‌ఎంపిపిలు రవీంద్రబాబు, హరినారా యణరెడ్డి, మండలవైకాపాయూత్‌కన్వీనర్‌కార్తీక్‌రెడ్డి, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాలంటీర్లతోనే అర్హులందరికీ లబ్ధి

**– పూతలపట్టు వైకాపా ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్**



**యాదమరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన వాలంటీర్ల వ్యవస్థతోనే ప్రభుత్వ పథకాలు అర్హులందరి ఇళ్ళ వద్దకు చేరాయని పూతలపట్టు వైకాపా ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్ అన్నారు.యాదమరి ఎంపిడిఓ కార్యాలయంలోబుధవారంవాలంటీర్లకువందనం కార్యక్రమానికిహాజరై వాలంటీర్లను సత్కరించారు. వాలంటీర్లు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించి ప్రజలకు మరింత ఉత్తమ సేవలందించాలన్నారు. ఎంపిపిసురేష్ బాబు,ఎంపిడిఓ సింగయ్య, వైస్ ఎంపిపిలు హరినారా యణరెడ్డి, రవీంద్రబా బులు,జిల్లా వైకాపా కార్యదర్శి మాదిరెడ్డిపల్లి మనోహర్‌రెడ్డి, మాజీ జడ్పీటిసీ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

## జంగంపల్లెలో కాశీవిశ్వేశ్వరస్వామివారి తిరుణాల ప్రారంభం

**సదుం,ఫిబ్రవరి21ప్రభాతవార్త** పాలమంద పంచాయతీజంగంపల్లెలో వెలసిన శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి వారి తిరు ణాల వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం అంకురార్పణ కా ర్యక్రమం నిర్వహించారు. అర్చకులు వేద మం త్రోచ్చారణలనడుమ పూజలు ప్రారంభించారు.ఈనెల 22నధ్వజారోహణం,23నప్రత్యేక అభిషేకాలు, దేవరెడ్డుల పూజాకార్యక్రమం,రాత్రిఅన్నదానం,24వతేదీశ్రీ శివపార్వతుల కల్యాణం,25వతేదీ ఉదయం వసంతోత్స వం, సాయంత్రం పార్వేట ఉత్స వం,రాత్రి పవళింపు సేవ ఉంటాయి.

## బ్రహ్మోత్సవాలు విజయవంతానికి కృషి చేయాలి



**యర్రావారిపాలెం,ఫిబ్రవరి21ప్రభాతవార్త** మహాశివరాత్రి సందర్భంగా తలకోన సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్స వాలు విజయ వంతానికి సమిష్టిగా కృషి చేయాలని ఛైర్మెన్‌భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిద్దేశ్వరస్వామి వారి ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.సమావేశంలోఎంపీడీఓ మధుసూధన్‌రావు, ఎమ్మార్వో బాలకిషన్, ప్రత్యేక ఆహ్వానితులుచెంగల్‌రెడ్డి,మండల వైకాపా కన్వీనరు నాగా ర్జునరెడ్డి,సర్పంచ్‌దేవేంద్ర, పాలక మండలిసభ్యులుజయంత్,నాగిరెడ్డి,మధు సూదన్‌శెట్టి,సురేష్,మంజులరాజేశ్వరి, గంగోజి, కార్యనిర్వహణాదికారిజయకుమార్, ప్రధానఅర్చకులుశివప్రసన్నశర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వలంటీర్లుకు అవార్డుల ప్రదానం

**ఐరాల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** మండలంలోని ఉత్తమ వలంటీర్లకు బుధవారం పూతలపట్టు నియోజక వర్గ వైకాపా అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ చేతుల మీదుగా బుధవారం అవార్డులను ప్రదానం చేశారు. సేవామిత్ర, సేవారత్న, సేవావజ్రఅవార్డులకు ఎంపికైన వలంటీ ర్లుకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సునీల్‌కుమార్ అవార్డులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కుసుమకుమారి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ రీజినల్ ఛైర్‌పర్సన్ శైలజా చరణ్‌రెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వలంటీర్లు దేశానికి ఆదర్శం



**చౌడేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** మన వలంటీర్లు దేశానికి ఆదర్శంగా నిలిచారని వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనంలో వలంటీర్లకు అభినందన, సన్మానసభ జరిగింది.వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడం వెనుక మంత్రిపెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి సూచనలున్నాయని గుర్తు చేసారు. దేశ విదేశాల వారు సైతం సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థను అధ్యయనం చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ కష్టపడి ప్రభుత్వాన్ని గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. అనంత రంగడ్డంవారిపల్లిపంచాయతీలోనినగేష్‌బాబు, లక్ష్మీదేవిలకు సేవావజ్రపథకాలు,చౌడేపల్లివలంటీర్‌శ్రావణి, ఆమిని గుంటగౌతమి,పుదిపట్ల రమా దేవి, చారాలస్పందన, పెద్దకొండామర్రి రత్నలకుసేవారత్న, 118మంది వాలంటీర్లను సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. మంత్రి పెద్దిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి మునితుకారామ్, జడ్పీటీసీ నడింపల్లి దామోదర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, వైకాపా మండలాధ్యక్షుడుకూరపర్తిఅంజిబాబు,ఉపాధ్యక్షులు నరసింహు లు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ రవిచంద్రారెడ్డి, ఆర్యవైశ్య విభాగ రాష్ట్రకార్యదర్శి గ్రంధెం మంజునాథ్, మాజీ ఎంపిపి రుక్మిణమ్మ, ఎంఎండిఓ డాక్టర్ వెంకటేశు, ఐఓఆర్డీ కృష్ణవేణి, సర్పంచు శ్రీరామ్‌భరత్‌వరుణ్, ఎంపిటీసీలు రూపారేఖా, తొండా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రి కుప్పం సభను విజయవంతం చేద్దాం

ఈనెల 26న కుప్పంలో జరిగే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభను విజయ వంతం చేద్దామని వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయన స్థానిక నాయకులతో సమావేశమయ్యారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం వైకాపా కార్యదర్శి పెద్దిరెడ్డి పంపిణీ చేసారు. ఈ మంత్రి పెద్దిరెడ్డివ్యక్తిగత కార్యదర్శి మునితు కారామ్, జడ్పీటీసీ నడింపల్లిదామోదర్‌రాజు, ఎంపిపి గాజులు రామ్మూర్తి, వైకాపా మండలాధ్యక్షుడుకూరపర్తి అంజిబాబు, ఉపాధ్యక్షులు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండోఛైర్మన్ రవిచంద్రారెడ్డి,ఆర్యవైశ్య విభాగ రాష్ట్రకార్యదర్శి గ్రంధెం మంజునాథ్, మాజీ ఎంపిపిరుక్మిణమ్మ, జిల్లా సేవాదళ్ళ సహాయకార్యదర్శి హరీష్‌రాయల్, బోయకొండ ధర్మకర్తల మండలి సభ్యుడుపవన్‌రాయల్,సర్పంచుశ్రీరామ్‌భరత్‌వరుణ్,ఎంపిటీసీలురూపారేఖా,తొండాశ్రీరాములుపాల్గొన్నారు

## కలసికట్టుగా విజయం సాధిద్దాం : డాక్టర్ థామస్

**ఎస్ఆర్‌పురం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాలని జిడినెల్లూరు నియోజకవర్గ 'దేశం' ఇన్‌ఛార్జి డాక్టర్ థామస్‌అన్నారు.డికెమర్రిపల్లిపంచాయతీలో బుధవారం ఆయనమండల పార్టీ అధ్యక్షుడుగంథమనేనిజయశంకర్‌నాయుడుల ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారంటీ–బాబు ష్యూరిటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలో వున్న సమయంలో యువతకు కల్గిన ఉద్యోగ అవ కాశాలు,కులవృత్తులనుప్రోత్స హించారన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జీ, మాజీ సర్పంచ్ బాబునాయుడు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు నరేష్, మహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేటమిట్ట రాముని సేవలో టిటిడి ఛైర్మన్ భూమన



**చిత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పూతలపట్టు మండలం పేటమిట్ట శ్రీకోదండరామ స్వామి దేవాలయంను టిటిడి ఛైర్మన్‌భూమన కరుణాకరం రెడ్డి, ఆయన సతీమణి రేవతిలు దర్శించు కున్నారు.అమరరాజాసంస్థలఅధినేతలు,ఆలయ ట్రస్ట్ అధ్యక్షులు గల్లా రామ చంద్రనాయుడు, గల్లా అరుణ కుమారిల ఆహ్వానం మేరకు టిటిడి ఛైర్మన్ భూ మన కరుణాకర్‌రెడ్డి దంపతులు ఆలయాన్ని సందర్శించారు. అర్చకులుస్వామివారిదర్శనఏర్పాట్లుచేసి టిటిడి ఛైర్మన్ దంపతులకు స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## సదుం ఎంపీడీఓగా రాజశేఖర్‌బాబు

**సదుం ఫిబ్రవరి21ప్రభాతవార్త** సదుంఎంపిడిఓగా జి.సురేష్‌బాబునియమితులయ్యారు.ఆయన పులిచెర్ల ఈఓ ఆర్‌డీగా పనిచేస్తున్న ఆయన సదుం ఎంపిడిఓగా బుధవారం బాధ్యతలు స్వీక రించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ అందరిని కలుపుకుని ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషిచేస్తానన్నారు. ఎంపిపి ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి,ఈఓఆర్‌డీ వరప్రసాద్,ఆయనను అభినందించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

**- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య**



**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వంపనిచేస్తుందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారకోటపోలూరు, ఆబాక తదితర పంచాయతీలపరిధిలో జరిగిన పలుఅభివృద్ధికార్యక్రమాలను ఆయనప్రారంభించారు. కోటపోలూరు పంచాయతీ లోని పడమర దళితవాడలో మూడు సిసి రోడ్లను నిర్మించి ప్రారంభిస్తున్నామని చెప్పారు. అలాగే కోటపోలూరులోని శ్మశానవాటికను ఆధునీకరించే పనులను శంకుస్థాపన చేశామన్నారు. తరువాత ఆబాక పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన సచివాలయభవనాన్ని సంజీవయ్య ప్రారంభించారు.ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, అల్లూరు రమేష్‌రెడ్డి, జెట్టి వేణు, బద్దెపూడి మోహన్‌రెడ్డి, వీరాస్వామి, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వలంటీర్లే సంక్షేమ వారధులు - ఎమ్మెల్యే సంజీవయ్య



**తడ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** గ్రామాల అభివృద్ధికి,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వలంటీర్లు ఎంతో ఉపయోగపడుతున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. లబ్ధిదారులకు పథకాలుఅందేందుకు ప్రభుత్వంతో వారధులుగా వలంటీర్లు కలిసి పనిచేస్తున్నారని కితాబిచ్చారు. బుధవారం ఆయన తడలో పలువురు వలంటీర్లను సన్మానించారు. సేవారత్న కింద ఎంపికైన ఐదుగురు, సేవామిత్ర కిందఎంపికైన228మందివాలంటీర్లనుఈసందర్భంగా సత్కరించారు. ఈకార్యక్ర మంలో ఎంపిడిఓ అమోస్‌బాబు, ఎంఇఓ మల్లికార్జున రావు, ఎంపిపి కొళవి రఘురెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు, తడ సర్పంచ్ కె.ఆర్ముగం, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## వాలంటీర్లకు ఘన సన్మానం



**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** మండల పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం సంబంధిత వాలంటీర్లను ఘనంగా సన్మానిం చారు. స్థానిక ఎస్‌కెఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవ య్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం వాలంటీర్ల సేవలకు గుర్తింపుగా సన్మాన కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్స హిస్తోందని సంజీవయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, జెట్టి వేణు, చిన్ని సత్యనారా యణ, బద్దెపూడి మోహన్‌రెడ్డి, బుంగా చెంగయ్య, తుపాకుల ప్రసాద్, వడెం సుధాకర్, ఎంపిడిఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## భావన రుషి తిరునాళ్లలో రాంకుమార్‌రెడ్డి



**వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** పద్మశాలీల ఆరాధ్య దైవమైన భద్రావతి సమేతభావన ఋషి తిరునాళ్ల కార్యక్ర మంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. రామ్ కుమార్ రెడ్డికి పద్మశాలీలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వర రావు, కౌన్సిలర్లు మాద జానకిరామయ్య,ఎంఏనారాయణ, సుబ్బారావు, మాజీ కౌన్సి లర్ చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులు, దివ్యాంగులకు ఇంటినుంచే ఓటు

**వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** దివ్యాంగులు, వృద్ధులు,కోవిడ్ బారిన పడి ఇబ్బందులు పడుతున్న వారు ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించుకోవచ్చని వెంకటగిరి సాంబశివరావు తెలిపారు. వెంకటగిరి తహశీల్దార్ కార్యాలయంలో పలు పార్టీల నాయకులతో ఓటర్ల జాతితా పైసమావేశంనిర్వహించారు.80ఏళ్ళునిండిన వృద్ధులు, 40 శాతం దివ్యాంగులు, ఇంటిలోనే ఓటుహక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పించి ందని వివరించారు.సమావేశంలో బాలాయపల్లి, రాపూరు, సైదాపురం తహ శీల్దార్‌లో పుల్లారావు వెంకటస్వామి, ప్రవీణ్ కుమార్, ఎన్నికల డిటి చక్రవర్తి, వైసిపి నాయకులు మచ్చల వేణు, సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ

**కమిషనర్ వెంకటరామయ్య**



**వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** త్వరగా వచ్చినఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేయాలని సచివాలయ ఉద్యోగులకు కమిషనర్ వెంకటరామయ్య ఆదేశించారు. సచివాలయ ఉద్యోగులతో ఆయన ఆరోగ్య శ్రీ కార్డులుపంపిణీ పై సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య శ్రీ కార్డులను అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పై ఆయన సమీక్షించారు.

## గూడూరులో రెడ్ బుక్ డే

**గూడూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** స్థానిక సిపిఎం కార్యాలయంలో రెడ్ బుక్ డే కార్యక్రమం బుధవారం కామ్రేడ్ బి.వి.రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్. సురేష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టి. వెంకటరామిరెడ్డి సిపిఎం పట్టణ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, యుటిఎఫ్ నాయకులు సుధీర్, వవాసుదేవరావు, కెవిపిఎస్‌నాయకులు ఏ.ప్రసాద్,ఏంబేటి చంద్రయ్య, గూడూరు సిఐటియు పట్టణ ఆటో సంఘం నాయకులు బి. రమేష్, వి. భాస్కర్ రెడ్డి, షేక్ జమ్‌షిద్ అహ్మద్, పి. రమేష్, చిన్నా, మణి, వికెఎం వేణు, శివ, యోగి, శీను, వి. అనంత పవన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకి వారధి వాలంటీర్ వ్యవస్థ

**ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ మేరుగ మురళి**



**గూడూరు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థ ప్రభుత్వానికి ప్రజలకి వారధిలా పనిచేస్తుందని ఎమ్మెల్సీ, ప్రభుత్వవిప్ మేరుగమురళి అన్నారు. బుధవారం మండలంలోని 323 మంది వలంటీర్లకు ప్రజలకు చేసిన సేవలకు గుర్తుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ పొనకా దేవసేనమ్మ, మండల కన్వీనర్‌బొమ్మిడిశ్రీనివాసులు, వైసిపి సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, కోదూరు వీరారెడ్డి, నాసిన నాగులు పాల్గొన్నారు.

## విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

**విజిలెన్స్ అధికారి శ్రీనివాసబాబు**



**వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** విద్యుత్ చైర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ తిరుపతి కార్పొరేట్ కార్యాలయం విజిలెన్స్ అధికారి శ్రీనివాస బాబు హెచ్చరించారు. బుధవారం వెంకటగిరిలోని పలు ప్రాంతాల్లో ఆయన జిల్లా విజిలెన్స్ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో విద్యుత్ సర్వీసులును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బొప్పాపురం, పెరియవరం, కాంపాలెం, కుమ్మరిగుంట ప్రాంతాల్లో అక్రమ విద్యుత్తు వాడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి 25000 రూపాయిల జరిమానా విధించారు. అంతేకాకుండా అధికలోడు వాడుతున్న 9మందిని గుర్తించి వారికి 1,10,000 రూపాయిలు జరిమానావిధించారు. ఈ కార్యక్రమ ంలో తిరుపతి కార్పొరేట్ కార్యాలయ డిఈఈ మాధవరావు, స్థానిక విద్యుత్ ఏఈ జయచంద్ర రెడ్డి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

**ప్రిన్సిపాల్ రాంగోపాల్**



**బాలాయపల్లి, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రిన్సిపాల్ జేఎస్ రాంగోపాల్ తెలిపారు.బుధవారం వెంగమాంబ ప్రభుత్వ జూనియర్ కళాశా లలో కళాశాల వార్షికోత్స వాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కార్పొరేట్ కళాశాల ధీటుగా ప్రభుత్వ కాలేజీలో వసతులు ఉన్నట్లు తెలి పారు.

21 వెంకటగిరి 05. సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాంగోపాల్

## ఆరోగ్య శ్రీ పేరులలో ఈకేవైసీ చేసుకోవాలి

**వాకాడు, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** మండలంలోని ఆరోగ్యశ్రీ పొందిన ప్రతి ఒక్కరూ ఈకేవైసి చేసుకోవాలని ఎంపి డిఓ గోపినాథ్ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని పంచా యితీ కార్యదర్శులతో ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ గోపినాథ్ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ కార్డులో పేర్లు ఉన్న వారందరికీ తప్పనిసరిగా ఈకేవైసి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**రామకుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త** రామకుప్పంకు చెందినశివమ్మ వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ 1.80లక్షలు మంజూరయ్యాయి. బుధవారం ఈ చెక్కును ఎమ్మెల్సీ భరత్ బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఎఎంసిఛైర్మన్‌విద్యాసాగర్,ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళిఈ, నేతలుకేశవరెడ్డి,చెంగారెడ్డి,రాంబాబు,యశ్వంత్‌రెడ్డి,నారాయణస్వామి,భాస్కర్‌నాయక్,మురుగన్‌పాల్గొన్నారు

## వైసిపిని ప్రజలు ఓటుతో తరిమి తరిమి కొడుతారు

**తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు జి. నరసింహ యాదవ్**

**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుతో అక్రమాలకు అన్యాయాలకు పాల్పడుతున్న వైసిపి పార్టీని ఈ రాష్ట్రం నుంచి తరిమి తరిమి కొడతారని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జి. నరసింహ యాదవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆస్తులను లూటీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మీడియా పై చేస్తూ మీడియా నోరు నొక్కేస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. వాస్తవాలను వెలికి తీసే మీడియాపై దాడులు నిర్వహించడం దారుణమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, దీనిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గాలలో వైకాపా అభ్యర్థులుగా ఖరారు. అయిన వ్యక్తులు అప్పుడు అధికారికంగా సమావేశాలు ఏర్పాటు చేసి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని సూచిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా పరిపాలన అందిస్తామని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి, ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో ఎంతో నిబద్ధతతో ప్రజలకు సంక్షేమ పథకాలతో కూడిన ఎంతో నిబద్ధత ప్రజలకు సంక్షేమ పథకాలతో కూడిన పాలన అందించారని ఆయన గుర్తు చేశారు. ఆర్‌సి మునికృష్ణ, ఊకా విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ పాల్గొన్నారు.

## ఆనం.. వ్యక్తిగత రాజకీయ విమర్శలు మానుకో

**వైసిపి నాయకులు హితవు**

**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త** నెల్లూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యాలపై స్పందించిన తిరుపతి వైఎస్ఆర్‌సిపి నాయకులు బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తిరుపతిని అభివృద్ధి పరంగా ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, అభినయ రెడ్డిలను స్థాయి మరచి విమర్శించడం మానుకోవాలని వైఎస్ఆర్‌సిపి నాయకులు హితవు పలికారు. జగనన్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా అందేలా కరుణాకర్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్లు, పారిశుభ్రత వంటి కార్యక్రమాలు బేషుగా ఉన్నాయన్నారు. తిరుపతి రాజకీయాలు ఏమి తెలుసునని మాట్లాడుతున్నావని ఆననను ప్రశ్నించారు. ఇకపై మాట్లాడే ముందు ఆలోచించి మాట్లాడాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి సేవాదళ్ తిరుపతి అధ్యక్షులు అరుణ్ యాదవ్, వైఎస్ఆర్‌సిపి మహిళా నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



చిత్తూరురూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : చిత్తూరు పట్టణం ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధ వారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ అవగాహన సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.మనోహర్ అధ్యక్షతన ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునెస్కో 1999 ఫిబ్రవరి 21న అంతరాజతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించారన్నారు. తెలుగుశాఖా ధ్యక్షురాలు ప్రొఫెసరు జి. ఉషా రాణి మాట్లాడుతూ బంగ్లాదేశీయులు చేసిన ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంను జరుపుకొంటున్నట్లు తెలిపారు. అలాగే హిందీశాఖాధ్యక్షులు డా. షమ్స్ అక్తర్,ఆంగ్లఉపన్యాసకులు డా.రాజ్యలక్ష్మిలు మాతృభాష గొప్పతనం వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే సంతపేటలోని బృందావన్ పాఠశాల నందు హరివిల్లు కళావేదిక సభ్యులు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా ఏర్పాటుచేసి మాతృభాషా మాధుర్యాన్ని విద్యార్థులకు వివరించి భాషా భూషణ గొల్లాపిన్నిసుబ్రమణ్యశర్మ,విశ్రాంతఎపిఎస్ఆర్టీసి గణాంకాధికారి బి.భాస్కర్‌రెడ్డి లను ఘనంగా దుశ్శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో హరివిల్లు కళావేదిక సభ్యులు భాస్కర్‌రెడ్డి,హరినాయుడు,గోవిందన్‌లతో పాటు పాఠశాల ఉపా ధ్యాయ బృందం,విద్యార్థిని, విద్యార్థులుపాల్గొన్నారు.

# టిక్కెట్టుకోసం...దూకుడు పెంచిన యువ డాక్టర్



**-నారా భువనేశ్వరిని కలసిన సురేంద్రబాబు**

పుంగనూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : స్థానికతే ప్రధానంగా జరుగబోయే ఈదఫా ఎన్నికలలో పలు నియోజకవర్గాల నుంచి పలువురు ఆశావహులు పలు పార్టీలలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ నేపధ్యంలో తెలుగుదేశం చిత్తూరు ఎంపి టిక్కెట్టుకు పోటీ చేసేందుకు తెరపైకి వచ్చిన చౌడేపల్లికు చెందిన పందిళ్ళపల్లివాసి, డాక్టర్ సురేంద్రబాబు తన ప్రయ త్నాల వేగంపెంచినట్లు తెలుస్తోంది. సురేంద్రబాబుగతంలోనే నారాలోకేష్ పాద యాత్రలో ఆయనను కలసితనకు చిత్తూరు ఎంపిటిక్కెట్టు ఇవ్వాలని అభ్య ర్థించారు. ఈక్రమంలో ఆయన ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన పార్టీ అధినేత చంద్రబాబు కూడా కలిశారు. ఇదే క్రమంలో ఆయన తెదేపా సీనియర్,మాజీ మంత్రి నారాయణను కూడా కలిశారు. ఇప్పటికే డాక్టర్ సురేంద్రబాబు గురించి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంనుంచి కూడా విచారణలు జరిగాయి. ఈనేపధ్యంలో బుధవారం డాక్టర్ సురేంద్రబాబు కుప్పంలో నారాభువనేశ్వరిదేవిని మర్యాదపూర్వకంగాకలిశారు.స్థానికతతో పాటుమంచి ప్రొఫైల్ కలిగి,వైద్యసేవలతో పాటు సామాజిక సేవలలో ప్రధానంగా సాగుతున్న తాను ఎన్నికలలో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## పేదవారికి ప్రభుత్వ వైద్యం... అందించడమే లక్ష్యం : మంత్రి రోజా



పుత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : ప్రతి పేదవారికి వైద్యం అందించాలనే లక్ష్యంతో వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. బుధవారం పట్టణంలోని గోవిందపాలెంలో రూ. 80 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన హెల్త్ సెంటర్ గేట్‌పుత్తూరు వాసులకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి 108, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేస్తే తండ్రికి తగ్గ వారసుడిగా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి 108ను విస్తరించడమే కాకుండా ఆరోగ్యశ్రీ పరిధిని అయిదు లక్షల నుంచి 25 లక్షల వరకూ పెంచారని తెలిపారు. నగరిలో 100 పడకల ఆస్పత్రిని అయిదు కోట్లతో పునరుద్దరించి సిఎం జగన్‌తో ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే నగరిలో దయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. నగరిలో ఇప్పటికే రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రారంభించామని, పుత్తూరులో మరో రెండు మరొక అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల్లో 200 అర్బన్ హెల్త్ సెంటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో అదనపు పిహెచ్‌సిలు ప్రారంభించిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శ్రీహరి, మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్‌లు డి.జయప్రకాశ్ (చిట్టి), డి.శంకర్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులలో నోడల్ ఆఫీసర్లు బాధ్యత కీలకం

**జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీ షా**



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్లు బాధ్యత కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీ షా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశం నందు డిఆర్ఓ పెంచల కిశోర్‌తో కలిసి 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి నియమించిన నోడల్ ఆఫీసర్ల వారికి కేటాయించిన సహాయక సిబ్బంది ఎన్నికలలో నిర్వహించవల్సిన విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల నిర్వహణలో నోడల్ ఆఫీసర్ల బాధ్యత కీలకమని నోడల్ ఆఫీసర్లకు కేటాయించిన విధులను ఎప్పటికప్పుడు సహాయక సిబ్బందితో సమన్వయ చేసుకుని ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలన్నారు. తిరుపతి జిల్లా ఏర్పడ్డాక మొదటి సారిగా ఎలక్షన్స్ జరుగుతుందని, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫేస్ బుక్, ట్విటర్, ఇన్స్టగ్రామ్ సోసియల్ మీడియాలో ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చే సూచనలు అప్‌లోడ్ చేయాలని సంబంధించిన నోడల్ అధికారిని ఆదేశించారు. గతంలో ఎన్నికలు విధులు నిర్వహించినను, ఎలక్షన్ విదులు కొత్తగానే ఉంటుందని, నోడల్ ఆఫీసర్లు అందుకు ఎన్నికల నియమావళికి సంబంధించిన బుక్‌ను పూర్తిగా చదువుకొని అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని అధికారులు అందరం కలసి సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణలో జిల్లాకు మంచి పేరు తతీసుకువద్దమన్నారు. ఈ సమావేశంలో వివిధ నోడల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విశ్వ బ్రాహ్మణలను ఆదుకున్న ఘనత తెలుగుదేశం పార్టీది

**విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహర్ ఆచారి**

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న విశ్వబ్రాహ్మణులకు, తెలుగుదేశం పార్టీ హయాంలో నందమూరి తారక రామారావు, చంద్రబాబు నాయుడులు సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా ఆదుకున్నారని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేజర్ల మనోహర్ ఆచారి తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విశ్వబ్రాహ్మణులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 22 లక్షల విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయని వీరందరూ చేతివృత్తులపైన ఆధారపడి ఉన్నారని ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. టిడిపి హయాంలో చేతి వృత్తుల వారికి ఆదరణ పథకం ద్వారా చేతి పనిముట్లు అందజేసారన్నారు. స్వార్ధ రాజకీయాల కోసం కల్లిబొల్లి మాటలు చెప్పే, నాయకులను నమ్మమని రానున్న ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకొని విశ్వబ్రాహ్మణులకు సహాయ సహకారాలు అందించే పార్టీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకురావాలని ఆయన వారి కులస్తులను కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కన్వీనర్లు సుబ్రమణ్యం ఆచారి దేవరాజులు ఆచారి, అన్నామలై ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ భాష దినోత్సవ వేడుకలు

తిరుపతి క్రీడ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : తెలుగుఅధ్యయన శాఖ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి సెట్విన్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం బుధవారం ఉదయం 12 గంటలకు సెమినార్ హాల్ హ్యూమానిటీస్ బ్లాక్ నందు దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా విచ్చేసిన డా. వై. సుభాషిణి ఇన్‌చార్జి శాఖాధ్యక్షులు మాట్లాడుతూ భిన్న ప్రాంతాలలో భిన్న భాషల వారు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటామని, దేశీయ భాషలను సంరక్షించారు. జీవిత కాల అభ్యాసాలను ప్రోత్సహించడానికి తెలుగు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింప చేసేది మాతృభాష అని తెలిపారు. మాతృభాషలో చదువుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆచార్య పి. కుసుమకుమారి పూర్వ ఉపాధ్యక్షులు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాట్లాడుతూ భాషను చాలా గొప్పదిగా తెలుపుతూ భాష సహకారం వ్యక్తికరణ రెండూ భావవ్యక్తీకరణ సాధనాలని వారు తెలిపారు. భాషలో వినడం, మాట్లాడడం, రాయడం, అర్థం చేసుకోవడం వంటివి ముఖ్యమైన సాధనాలు అన్నారు. జీవితంలో భాషను ఎట్లా పెంపొందిప చేసుకోవాలో వారు తెలిపారు. పిల్లలకు తెలుగు పద్యాలు చదవమని వారు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. యువశ్రీ, డాక్టర్ మాధవి, డాక్టర్ అనురాధ, వివిధ శాఖల విద్యార్థినులు, పరిశోధక విద్యార్థినులు పాల్గొని సభను దిగ్విజయం చేశారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

**- రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ పుల్లయ్య**



చిత్తూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుత వాతా వర ణంలో జరగడానికి రాజకీయ పార్టీలప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా రెవెన్యూఅధికారి బి.పుల్లయ్యపిలుపునిచ్చారు. డిఆర్ఓ సమావేశ భవనంలో బుధవారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో గత నెల 22న విడు దల చేసినా ఇంకా దరఖాస్తులు వస్తున్నాయని, ఈ విషయంపై క్షేత్రస్థాయిలో విచారించినివేదికలు పంపి అనుమతిపొందిన తరువాత విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ ప్రతినిధులు భాస్కర్, పరదేశి, వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి వెంకిటీల సురేంద్రకుమార్, కలెక్టరేట్ ఎలక్షన్ సూపరిటెండెంట్ ప్రసాద్‌బాబు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

**'వార్త' ప్రభావం**

## పశువైద్యం అందించకుంటే ఎలా!

**- పశువైద్యశాలలను తనిఖీ చేసిన ఎంపిడిఓ**



పాలసముద్రం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ప్రభుత్వం పశువైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తుంటే, క్షేత్ర స్థాయికి వెళ్ళి అనారోగ్యంతో వున్నపశువులకు వైద్యం చేయకుంటే ఎలాగని ఎంపిడిఓ ఎం. రామనాధరెడ్డి వైద్యాధికారిణి డాక్టర్ యశస్వి నిని ప్రశ్నించారు. వనదుర్గాపు రానికి చెందిన రైతు జయరాంశెట్టి లేగదూడ ఈ నెల 15న మృతి చెందడం, ఈ విషయం 'ప్రభాత వార్త'లో ప్రచురించడంతో రైతు జయరాం శెట్టితో కలిసి ఎంపిడిఓ బుధవారం పశువైద్యశాలను తనిఖీ చేశారు. ఈ మేరకు అక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ యశస్వినితో ఎంపిడిఓ మాట్లాడుతూ వనదుర్గాపురంలో లేగదూడ మృతిపై తనకు నివేదిక ఇస్తే తాను ఉన్నత అధికారులకు పంపుతానన్నారు. రైతు రామనాధరెడ్డితో ఎంపిడిఓ మాట్లాడుతూ లేగదూడ పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందిందని తేలితే సంబంధితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## నారా భువనేశ్వరిచే అన్న క్యాంటీన్లు ప్రారంభం



శాంతిపురం/రామకుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:మండల కేంద్రాలైన శాంతిపురం, రామకుప్పంలలో ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నక్యాంటీన్లను ప్రారంభించారు. ఈసందర్బంగా ఆమె మాట్లా డుతూ పేదలకుఆకలి లేకుండా చూడాలనే లక్ష్యంతో గతంలో చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లు తెరిస్తే జగన్ పాలనలో వాటిని ధ్వంసం చేయడం, మూసివేశారన్నారు. అందుకోసమే నేడు రాష్ట్రవ్యాప్తంగా తెదేపా కార్యకర్తలు పేదల కోసం 150 అన్న క్యాంటీన్లు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ లు డా॥ కంచర్ల శ్రీకాంత్, పంచుమర్తి అనురాధ, జిల్లా టిడిపి అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్‌మునిరత్నం, విశ్వనాథనాయుడు ,ఆనందరెడ్డి, మునస్వామి, ఆంజనే యరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ ఫైనలియర్ ఫలితాల్లో పిఇఎస్ వైద్యకళాశాల విద్యార్థుల ప్రతిభ



కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: డా॥ వైఎస్సార్ హెల్త్ సైన్సెన్ యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన ఫైనలియర్ ఎంబిబిఎస్ పరీక్షా ఫలితాల్లో కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల విద్యా ర్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కాలేజ్ డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ఆర్ కృష్ణారావు తెలిపారు. మొత్తం117 మంది విద్యార్థులకు గాను 111మంది (95శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. 1డిస్టింక్షన్, 37ఫస్ట్‌క్లాస్, 73 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. 79శాత ం మార్కులతో గౌతమి అనే విద్యార్థిని టాపరుగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోనేపిఇఎస్ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థులకఠోర శ్రమ,అధ్యాపకుల కృషి, కళాశాల అందించిన ప్రప ంచస్థాయి సౌకర్యాలు ఇందుకు కారణమని పిఇఎస్ వైద్య కళాశాల ఛైర్మన్ డా॥ దొరస్వామి నాయుడు పేర్కొన్నారు.

## వాలంటీర్ల సేవలు అభినందనీయం - ఎమ్మెల్సీ భరత్



శాంతిపురం/రామకుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు అని వీరి సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. బుధవారం శాంతిపురం,రామకుప్పం మండలాల్లో ప్రభుత్వం తరపున వాలంటీ ర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర అందజేశారు. ఈసందర్బంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ సిఎంజగన్ తెచ్చిన సచివాలయవ్యవస్థ, వాలంటరీ వ్యవస్థలు దేశానికే ఆదర్శమన్నారు.కార్యక్రమాల్లోఎంపిపిలు వసుంధర కోదండరెడ్డి, సుబ్రమణ్యం,జడ్పీటిసిలుశ్రీనివాసులు,నితిన్‌రెడ్డి,మండలకన్వీనర్లు బాబురెడ్డి, దండపాణి, జగదీష్‌నాయుడు, కో కన్వీనర్ చం ద్రారెడ్డి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, సర్పంచులు మురళి, రాజగోపాల్, కేశవరెడ్డి, పెనుమేలు సింహ, తహశీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.

## చిట్టమూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హల్‌చల్

చిట్టమూరు, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : మండల పరిధిలోని కొత్తగుంట గ్రామంలో బుధవారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హల్‌చల్ చేశారు. కొత్తగుంటలోని ఓ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో సమాచారం అందుకున్న ఓ విలేకరి ఫొటో తీస్తుండగా చిరుబుర్రులాడింది. నా ప్రమేయం లేకుండా తన ఫొటో ఎలా తీస్తారు, నేనొచ్చేది ఎవరికీ తెలియదు.. మీకెలా తెలిసిందంటూ రెచ్చిపోయారు. చిట్టమూరు మండలం మల్లాంలో ఓ మెడికల్ షాపు అనుమతులు నిమిత్తం విచ్చేసిన డగ్ ఇన్‌స్పెక్టర్ కొత్తగుంటలో ఫొటోలు తీయడానికి వెళ్లినమీడియా వారిపై చిరుబుర్రలాడటాన్ని స్థానిక ప్రజలు సైతం నిశితంగా గమనించారు. మెడికల్ షాపులు, ఆరోగ్య కేంద్రాలను పరిశీలన చేసి నిబంధనలకులోబడి షాపులు నిర్వహించేందుకు తనిఖీలు నిర్వహిస్తే ప్రజలు హర్షిస్తారే తప్ప, ఇలా లోలోపల తనిఖీలు చేసి ఎలాంటి నివేదికలు బయటకు తెలియకుండా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వెళ్లిపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది.

## ఆర్‌బీకేలతో బహుళ ప్రయోజనాలు - మంత్రి రోజా



నగరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఆర్‌బీకేలతోబహుళప్రయోజనాలు రైతులకుఅందుతోందని మంత్రి రోజా అన్నారు. బుధవారం వీకేఆర్ పురంలో రూ.21.8 లక్షల నిధులతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.8లక్షలనిధులతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించి ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు సమీపం లోని ఆర్‌బీకేల్లోనే అందుతోందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిని, ఎంపీటీసీ ఇమ్రాన్‌ఖాన్, వైసీపీ పార్టీ మండల అధ్యక్షులు సుదర్శనం నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ హరి, నాయకులు దేవరాజులు, రవి, భాస్కర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**పాంచాలమ్మ పాండవులను దర్శించుకున్న మంత్రి రోజా**

సత్రవాడలోని పాంచాలి సమేత పాండవ ఆలయంలో కుంభాభిషేక వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో హోమ పూజలు, కలశపూజలు నిర్వహించారు. కుంభాభిషేక వేడుకల్లో మంత్రి రోజా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె వెంటమున్సిపల్ ఛైర్మన్‌నీలమేఘం,వైస్‌ఛైర్మన్‌బాలన్, వైసీపీ రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణన్, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు అయ్యప్పన్, జిల్లా నేత విభాగం అధ్యక్షులు కన్నాయిరం,ఎంపీపీ భార్గవి, నాయకులు ఇ.కె.అయ్యప్పన్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు యువతనేతలకు నారా భువనేశ్వరిచే హెల్మెట్లు పంపిణీ

కుప్పంరూరల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: కుప్పం నియోజకవర్గంలో సైకిల్ యాత్ర చేపట్టిన తెలుగుయువత నాయకులకు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి బహుమతులు అందించారు. కుప్పం ఆర్‌అండ్‌బిఅతిథిగృహంలో తెలుగుయువత నేతలకు హెల్మెట్లను బహు మతిగా అందించారు. వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ పెట్టుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రికి ముందే అభివృద్ధి పనులు గుర్తుకొస్తాయా? జనం చర్చ

**ప్రణాళికా లోపం: ప్రజలకు శాపం**

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి దేవస్థానం అధికారులకు శివరాత్రి వరకు అభివృద్ధి పనులు గుర్తుకు రావా? శివరాత్రి మరో 15రోజుల్లో ప్రారంభం కానుండగా అభివృద్ధి పేరుతో జనాన్ని ఇబ్బందులకు గురు చేస్తున్నారనే విమర్శలు చోటు చేసుకున్నాయి. అధి . కారుల ప్రణాళికాలోపంతో ప్రజలకు ఇబ్బందులు దేవస్థానం నిధులు దుర్విని యోగం అవుతున్నాయని జనం చర్చించుకుంటున్నారు. అంతేకాక పేరుకు టెండర్లు నిర్వహిస్తూ పనులన్నీ అస్మదీయులకు అప్పగించి అవసరం లేని పనులకు కూడా భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు విమర్శలు వినబడుతున్నాయి.గత ఏడాది సంక్రాంతి, శివరాత్రి ముందు అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటుకు సంబంధించి నాలుగుమాడావీదుల్లో రోడ్లను తవ్వేసారు. దాంతో నాలుగుమాడ వీధుల్లో వ్యాపా రులు తల్లడిల్లారని ప్రస్తుతం మళ్ళీ రోడ్లను తవ్వేస్తున్నారని ఇబ్బందులు పడుతున్నారు.

**ముందు జాగ్రత్త లేకుండా . . .**



శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు సమన్వయం లేకుండా పనులు చేపట్టటం వల్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే విమర్శలుచోటు చేసుకున్నాయి. విద్యుత్ శాఖ రూ.15కోట్లు వెచ్చించి నాలుగుమాడ వీధుల్లో అండర్ గ్రౌండ్‌కేబుల్‌ను ఏర్పాటుచేసారు. అప్పుడే అత్యాధునిక లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పుడే విద్యుత్ శాఖ దేవస్థానం అధికారులు సమన్వయంతో చర్చించి వీధి లైట్ల ఏర్పాటుకు కేబుల్ ఏర్పాటు చేసుకొని ఉంటే నిధులు ఆదా అయిఉండేది. కానీ ఎందుకో అలా చేయక పోవటంతో ప్రస్తుతం వారం రోజులుగా నాలుగుమాడ వీధుల్లో వీధిలైట్లు కేబుల్ ఏర్పాటుకు రోడ్లను తవ్వేస్తున్నారు. ఇంత దుబారా అవసరమా?అనిచర్చించుకుంటున్నారు.అంతేకాక పనుల నిర్వహణలో జాప్యంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

# కుప్పం ప్రజలకు చంద్రబాబు..భువనమ్మలు తల్లిదండ్రులు



కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : కుప్పం నియోజకవర్గ ప్రజలు మాజీ సిఎం చంద్రబాబునాయుడు, ఆయన సతీమణి నారా భువనేశ్వరిలను తల్లిదండ్రుల్లా భావిస్తారని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం ప్రజలకు ఏ కష్టంవచ్చినా ఆ దంపతులు ఇద్దరూ 35 ఏళ్లగా అండగా ఉన్నార న్నారు. కుప్పంప్రజలతో వారికి రాజకీయ బంధంలేదని కుటుంబ బంధం ఉంద న్నారు. శాంతిపురంలో జరిగిన మహిళా సదస్సుల్లో నారా భువనేశ్వరమ్మ చేసిన సరదావ్యాఖ్యలతోఅందరినీ నవ్వించారన్నారు.అయితే ఆమె ప్రసంగంలో అవాస్త వాలు ఓ ఛానల్‌లో కథనాలు వండివార్చడం దారుణమన్నారు. భువనేశ్వరమ్మ మాటలు వక్రీకరిస్తే జనమే తరిమి కొడతారని వ్యాఖ్యానించారు. కాగా613కోట్లతో గతంలో చంద్రబాబు సిఎంగాఉన్నపుడు హంద్రీ-నీవా కాలువల పనులు 87 శాతం పూర్తి చేశారన్నారు. పనులు పూర్తికాకుండా కేసులు వేసింది ఎవరో మంత్రి పెద్దిరెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు కుప్పం రైతుల పొట్ట గొట్టిన పాపం మంత్రి పెద్దిరెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, నేతలు రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, ప్రతాప్, మణి, జిమ్‌దాము, మురళి, మునెప్ప, వసంతమ్మ పాల్గొన్నారు.

# నైతిక విలువలు పాటించాలి : డా॥ ప్రసాద్‌రెడ్డి




కుప్పం, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : వైద్యులు తమ వృత్తిలో నైతిక విలువలు పాటించాలని ఎపి మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డా॥ ఎస్వీకె ప్రసాద్‌రెడ్డి సూచించారు. బుధవారం కుప్పం పిఇఎస్ వైద్యకళాశాలలోపిజి,జూనియర్ డాక్టర్లకు వైద్యవిలువలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిఇఎస్ వైద్యకళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్ ఆర్ కృష్ణారావుమాట్లాడుతూవైద్యులు సేవాభావంతో మెలగాలని సూచించారు. అనంతరం వైద్యులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య, వైస్ ప్రిన్సిపాల్ డా॥ ర్యాలీ సుబ్బారావు, పీజి విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

## బంగారు తిరుచ్చిపై శ్రీ సీతారామలక్ష్మణులు

చంద్రగిరి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం పునర్వసునక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామలక్ష్మణ హను మంతులు బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శన మిచ్చారు.భక్తులగోవింద నామస్మరణల నడుమ స్వామివారు తిరుమాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓవరలక్ష్మి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్,అర్చకులు కళ్యాణ సుందర్,అధ్యాపకసంతానకృష్ణన్, పరిచారికడాక్టర్ఇల్లందు లక్ష్మీరాజేష్,ప్రభాకర్, మోహన్ నాయుడు, ఓ.ఎస్.డబ్ల్యు రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.